23. 3. 2026

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 286 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## రైతులకు శుభవార్త... రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి



సిద్దిపేట మార్చి 22 (వెలుతురు) : తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. రైతు భరోసా పథకం కింద సాగుకు ఆర్థిక సాయం అందించేందుకు తొలి విడత నిధులను విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.3,590 కోట్లను విడుదల చేశారు. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో, ఈ మొత్తం సోమవారం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని ప్రభుత్వం తెలిపింది. రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు గాను రూ.9,000 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా మొదటి విడతను విడుదల చేయగా, మరో 20 రోజుల్లో రెండో విడతగా రూ.2,650 కోట్లు, ఆ తర్వాత మరో 20 రోజుల్లో మిగిలిన రూ.2,760 కోట్లను విడుదల చేయనున్నట్టు సీఎం ప్రకటించారు. ఈ పథకం 2 లో..



## ఇక్కడ గెలిచిన అభ్యర్థిని మంత్రిని చేస్తాం



సిద్దిపేట మార్చి 22 (వెలుతురు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిద్దిపేట గడ్డపై సంచలన రాజకీయ హామీ ఇచ్చారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే, ఆ ఎమ్మెల్యేను నేరుగా మంత్రివర్గంలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. సిద్దిపేటలో జరిగిన రైతు మహోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాలుగా ఒకే కుటుంబం చేతిలో ఉన్న సిద్దిపేట రాజకీయాల్లో మార్పు తప్పనిసరని సీఎం పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే, ఆ ఎమ్మెల్యేను మంత్రిని చేసే బాధ్యతను తాను, మంత్రులు దామోదర్ రాజనరసింహ, వివేక్ వెంకటస్వామి తీసుకుంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాలకు ఒక్కోదానికి 3,500 చొప్పున మొత్తం 10,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

తమ ప్రభుత్వం నిష్పక్షపాతంగా పనిచేస్తుందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీపై వస్తున్న విమర్శలకు సీఎం బదులిచ్చారు. సిద్దిపేట రైతుల మేలు కోసమే ఫ్యాక్టరీని ఇక్కడే కొనసాగిస్తున్నామని, తలుచుకుంటే దానిని తన నియోజకవర్గం కొడంగల్‌కు తరలించుకునేవాడినని అన్నారు. కానీ, స్థానిక రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేశామని చెప్పారు. తాను ఎమ్మెల్యేల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్టుల కోసం రైతులను భయపెట్టి భూములు లాక్కుందని, కానీ తాము నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల కోసం 98.5 శాతం మంది రైతులకు మెరుగైన పరిహారం ఇచ్చి ఒప్పించామని వివరించారు. “ఒక్కసారి మార్పు చేసి చూడండి.. మంచి జరుగుతుందో లేదో మీకే తెలుస్తుంది“ అని సిద్దిపేట ప్రజలను కోరారు. చైతన్యవంతులైన ప్రజలు ఆలోచించి 2029లో కాంగ్రెస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో సిద్దిపేట రాజకీయాలు మరింత వేడెక్కాయి.


## వాణిజ్య పంటలతో రైతులకు లాభసాటిగా వ్యవసాయం




సిద్దిపేట మార్చి 22 (వెలుతురు) : రైతుల సంక్షేమానికి ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నది గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రభుత్వం. రైతును రాజుగా నిలబెట్టే ప్రతి పథకాన్ని తెలంగాణ రైతాంగానికి చేరువ చేస్తూ, వ్యవసాయ రంగంలో రైతులకు అండగా నిలుస్తోంది మన ప్రజా ప్రభుత్వం. ఈరోజు ప్రజా పాలన రైతు ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లాలో నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరి ప్రారంభోత్సవంతో పాటు రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన మరియు రూ.775.72 కోట్లతో జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, సహచర మంత్రులతో కలిసి పాల్గొనడం జరిగింది. ప్రజా 2 లో..

## అవమానాలు ఇక చాలు...

### రాజీనామాకు ముహూర్తం ఖరారు చేసిన జీవన్ రెడ్డి


T. Jeevan Reddy



జగిత్యాల మార్చి 22 (వెలుతురు) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి పార్టీని వీడాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత 20 నెలలుగా పార్టీలో తీవ్ర అవమానాలు, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, ఇకపై కొనసాగలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు జగిత్యాల జిల్లాకు చెందిన తన ముఖ్య అనుచరులు, కార్యకర్తలకు ఆయన ఒక లేఖ రాశారు. “అవమానాలు 2 లో..

## చీచమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష



న్యూఢిల్లీ మార్చి 22 (వెలుతురు) : పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కీలక రంగాల్లో సరఫరా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం, లాజిస్టిక్స్‌ను పటిష్టం చేయడం, పంపిణీ వ్యవస్థలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి 2 లో..

## అమరావతిలో నివసించే వారు 20 ఏళ్లు ఎక్కువ జీవిస్తారు

### - సీఎం చంద్రబాబు



హైదరాబాద్ మార్చి 22 (వెలుతురు) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి రేటును 15 శాతానికి చేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జరిగిన ‘సౌత్ ఏషియా లెర్నింగ్ మీట్‘కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా, అమరావతిని ప్రపంచంలోనే ఓ అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని, అక్కడ నివసించే వారు మిగతా వారికంటే 20 ఏళ్లు ఎక్కువ జీవించేలా అత్యుత్తమ వాతావరణం కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మిగతా ప్రాంతాలతో పోల్చితే ఏపీ రాజధానిలో జీవన ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండేలా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి తాను చేసిన కృషిని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. “1990లలో ఇంటర్నెట్ కొత్తగా వచ్చినప్పుడు ఐటీ కంపెనీలను తీసుకురావడానికి ఎంతో శ్రమించాను. ఢిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం పెట్టాలని కోరాను. నాటి ప్రధాని వాజ్‌పేయితో చర్చించి టెలికాం సంస్కరణలు తీసుకువచ్చాం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. ట్రిపుల్ ఐటీ, నల్సార్, జీనోమ్ వ్యాలీ వంటివి నా 2 లో..

### అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను



## 25 ఏళ్లుగా అధికారంలో.. ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు

న్యూఢిల్లీ మార్చి 22 (వెలుతురు) : ప్రధాని నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఓ చారిత్రక మైలురాయిని అందుకున్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధినేతగా 2 లో..

## తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్య వైశ్యులు కీలక పాత్ర




హైదరాబాద్ మార్చి 22 (వెలుతురు) : తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్య వైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ అనుముల ప్రశంసించారు. వాసవి అమ్మవారి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ దిశగా అవసరమైన చర్యలను శాసనసభ సమావేశాలు ముగిసేలోపే తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. 2 లో..




## ట్రంప్ హెచ్చరికకు ఇరాన్ కౌంటర్

### శత్రుదేశాల నీటి ప్లాంట్లే మా లక్ష్యం!

న్యూఢిల్లీ మార్చి 22 (వెలుతురు) : హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 48 గంటల హెచ్చరికలకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తే, పశ్చిమాసియాలోని శత్రుదేశాల మంచినీటి ప్లాంట్లనే లక్ష్యంగా చేసుకుంటామని ఘాటుగా 2 లో..

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

- మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

హైదరాబాద్ మార్చి 22 (వెలుతురు) : తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ 2 లో..

వెలుతురు

# రైతులకు శుభవార్త... రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ద్వారా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు ఎకరానికి ఏటా రూ.12,000 చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి నెలకు రూ.2,533 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం నెలకు రూ.5,500 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. పంట నష్టపోయిన రైతులకు కూడా పరిహారం అందిస్తున్నామని చెప్పారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం 71 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని సేకరించిందని, అయితే కేంద్ర ప్రభుత్వం 50 లక్షల టన్నులకు మించి కొనుగోలు చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. రైతులు వరికే పరిమితం కాకుండా పంట మార్పిడిపై దృష్టి సారించాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులు పండించే అన్ని పంటలకు లాభాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్య వైశ్యులు కీలక పాత్ర

తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన 'శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆర్య వైశ్యులే వెన్నెముకగా నిలుస్తున్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలోనే కాకుండా, దాని సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధిలోనూ వారు అవిభాజ్య భాగస్వాములుగా ఉన్నారు. ఆర్య వైశ్య సమాజానికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయి. మీ ఆశయాలు ఈ ప్రజల పక్షపాత ప్రభుత్వ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి. ఆర్య వైశ్యుల గుర్తింపు, హోదాకు ఎటువంటి భంగం కలగకుండా చూసేందుకు మేము అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాము. ఈ బృహత్తర వేడుకలో 'వాసవి సామూహిక పారాయణం' ద్వారా గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించినందుకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఆర్య వైశ్య సమాజానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. అహింస ద్వారా కూడా యుద్ధాన్ని గెలవవచ్చని నిరూపించిన గొప్ప తత్వవేత్త మహాత్మా గాంధీ ఈ గడ్డపై జన్మించడం భారతదేశానికి ఎంతో గర్వకారణం. అహింస, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి సూత్రాల ద్వారా జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఒక నూతన పద్ధతిని మహాత్మా గాంధీ ప్రపంచానికి పరిచయం చేశారు. మహాత్మా గాంధీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, శాంతి, అహింసా మార్గంలో పయనిస్తూ ఆర్య వైశ్యులు దేశంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు; రాజకీయ రంగంలో అవకాశాలు లభించినా లభించకపోయినా, చెక్కుచెదరని క్రమశిక్షణతో వారు దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేశారు. తెలంగాణలో ఆర్య వైశ్య సమాజానికి దక్కాల్సిన సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయి. మీ అభివృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను, కార్యక్రమాలను చేపడుతుంది. మీ గుర్తింపు, ఆత్మగౌరవం ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండేలా మేము చూస్తాము," అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా, ఆర్య వైశ్య సంక్షేమ, అభివృద్ధి ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు బెల్లి శ్రీధర్ తదితరులతో పాటు, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాణిజ్య పంటలతో రైతులకు లాభసాటిగా వ్యవసాయం

పాలన రైతు ఉత్సవాలు వేదికగా ఈరోజు రూ.3600 కోట్లు మొదటి విడత రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి గారు విడుదల చేశారు. రాష్ట్రంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించే దిశగా సిద్ధిపేట నియోజకవర్గంలోని నర్మెట్టలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో అద్భుతమైన ఆయిల్ పామ్ ఫ్యాక్టరిని ప్రారంభించడంతో పాటు రిఫైనరీనీ యూనిట్ ని ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. గత ప్రభుత్వ పెద్దలు నర్మెటలో కట్టిన ఫ్యాక్టరీ తమ హయాంలో కట్టినదిగా చెప్పుకుంటున్నారు. వారి హయాంలో కేవలం తెల్లకాగితాన్ని నల్లకాగితం చేసి ఒక జీవోను విడుదల చేశారు కాని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం వచ్చిన తరువాత ఆయిల్ పామ్ ఫ్యాక్టరిని నిర్మించడం జరిగింది. రాజకీయాలకతీతంగా, ప్రాంతాలకతీంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరి నిర్మాణాన్ని పూర్తిచేసి ఈ రోజు రైతులకు అంకితం చేయడం జరిగింది. ప్రతి పక్ష నేతలు ఎన్ని విషప్రచారాలు చేసినా, ఆరోపణలను గుప్పించినా ప్రజాప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది. ధరణిని బంగాళాఖాతంలో వేసి భూభారతితో భూసమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. త్వరలోనే సాదా బైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. ప్రతీపేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నది ప్రజా ప్రభుత్వం, ఏప్రిల్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభిస్తున్నాం. అది పింక్ చొక్కా తొడుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలైనా సరే అర్హుడైన పేదవారైతే చాలు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం. ఇది ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధి.

# అవమానాలు ఇక చాలు... రాజీనామాకు ముహూర్తం ఖరారు చేసిన జీవన్ రెడ్డి

భరిస్తూ పార్టీలో కొనసాగలేను" అని ఆ లేఖలో తన ఆవేదనను జీవన్‌రెడ్డి వ్యక్తం చేశారు. పార్టీలో తనకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని, ఇది మానసికంగా ఎంతో బాధించిందని ఆయన వాపోయారు. తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై త్వరలోనే స్పష్టత ఇస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, వారి సలహాలు సూచనలు తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. "నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి" అని ఆయన కార్యకర్తలను కోరారు. జీవన్‌రెడ్డి రాజీనామా ప్రకటనతో ఆయన ఏ పార్టీలో చేరతారనే దానిపై జగిత్యాల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆయన నిర్ణయం స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం-2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

# అమరావతిలో నివసించే వారు 20 ఏళ్లు ఎక్కువ జీవిస్తారు

కృషితోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, భవిష్యత్తులో ప్రపంచ డేటా సెంటర్లన్నీ భారత్‌కే వస్తాయని జోస్యం చెప్పారు. ప్రస్తుతం హార్టికల్చర్, ఆక్వాకల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉందని, గ్రీన్, సోలార్ ఎనర్జీని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గతంలో తాము ప్రవేశపెట్టిన పీపీపీ విధానంలోనే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టులు, ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని గుర్తుచేశారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు, ఇకపై రాష్ట్రాన్ని వేగంగా ప్రగతి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు.

### అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ)లో జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్-2026 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎచీవింగ్' అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిన తన ప్రస్థానాన్ని, రాజకీయంగా ఎదురైన సవాళ్లను, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ కోసం తనకున్న దార్శనికతను ఆయన పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనేవి మూడు కీలక స్తంభాలని, వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

బంజరు భూమి నుంచి భాగ్యనగరంగా...

1995లో తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేనాటికి హైదరాబాద్, సికింద్రాబాద్ అనే జంట నగరాలు మాత్రమే ఉన్నాయని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, బిల్ గేట్స్ తీసుకొచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని గమనించి, భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీదే అని తాను దృఢంగా విశ్వసించానని తెలిపారు. అప్పట్లో సైబరాబాద్ ప్రాంతం మొత్తం పాములు, ముళ్లపొదలతో నిండిన బంజరు భూమి అని, అక్కడ హైటెక్ సిటీ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ మొదట వెనుకాడిందని చెప్పారు. అయితే, వారిని ఒప్పించి పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (PPP) పద్ధతిలో కేవలం 15 నెలల్లోనే ఆ అద్భుత కట్టడాన్ని పూర్తి చేశామని వివరించారు. ఆ తర్వాత బిల్ గేట్స్‌ను కలిసి, కేవలం 10 నిమిషాల అపాయింట్‌మెంట్‌లో 45 నిమిషాల పాటు చర్చించి, భారతీయుల ప్రతిభను వివరించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటుకు ఒప్పించానని, ఆ రోజు తాను వేసిన పునాది వల్లే ఈ రోజు హైదరాబాద్ ఐటీ హబ్‌గా విలసిల్లుతోందని అన్నారు.

ఐఎస్బీ, విమానాశ్రయం.. హైదరాబాద్‌కు కొత్త రూపు

హైదరాబాద్‌కు ఐఎస్బీని తీసుకురావడానికి తాను పడిన శ్రమను చంద్రబాబు వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కలిసి ముంబై, బెంగళూరు, చెన్నైలలో ఐఎస్బీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలియగానే, తాను వెంటనే వారిని సంప్రదించి హైదరాబాద్‌కు ఆహ్వానించానని తెలిపారు. వారిని ఒప్పించడానికి తన మంత్రివర్గ సహచరులను విమానాశ్రయానికి పంపి, తానే స్వయంగా వారికి అల్పాహారం వడ్డించానని గుర్తు చేసుకున్నారు. మిగతా నగరాలు ఇచ్చే ఆఫర్ల కన్నా "బెస్ట్ ప్లస్ వన్" ఇస్తానని ఒక్క మాటతో హామీ ఇచ్చానని, తన చిత్తశుద్ధిని నమ్మి వారే హైదరాబాద్‌లో ఐఎస్బీ ఏర్పాటుకు ముందుకొచ్చారని చెప్పారు. అలాగే, చిన్నగా ఉన్న బేగంపేట విమానాశ్రయానికి ముందుగా ట్రాఫిక్ పెంచి, ఆ తర్వాత 5,000 ఎకరాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా నిర్మించామని తెలిపారు.

అభివృద్ధి చేసినా.. రాజకీయంగా ఎదురుదెబ్బలు

ఎంత అభివృద్ధి చేసినప్పటికీ, రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజమని చంద్రబాబు అన్నారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధికి ఎన్నో పనులు చేసినా, 2004 ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని అంగీకరించారు. "అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ (obsession) వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను. కేవలం అభివృద్ధి చేస్తే సరిపోదు, రాజకీయాలను కూడా చూసుకోవాలని ఆ ఓటమి నాకు నేర్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

పదేళ్ల తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినా, రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. 2019లో మరోసారి ఓటమి ఎదురైందని, ఈ అనుభవాలు తనను మరింత రాటుదేల్చాయని తెలిపారు.

విభజన తర్వాత.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా

2024లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇప్పుడు తన ముందున్న ఏకైక లక్ష్యం "స్వర్ణాంధ్ర ప్రదేశ్" నిర్మాణమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని, దానిని తిరిగి పునర్నిర్మించే పనిలో ఉన్నానని చెప్పారు. గత 21 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దీని ద్వారా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని వివరించారు.

గూగుల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని, అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. విజన్ 2047 డాక్యుమెంట్ సిద్ధం చేశామని, వచ్చే 15 ఏళ్ల పాటు ఏటా 15% వృద్ధి రేటు సాధించి, 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు.

అమరావతి, పోలవరం.. ఏపీకి జీవనాధారాలు

అమరావతి కేవలం రాజధాని కాదని, అది ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 33,000 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందని, ఇప్పుడు మళ్లీ పనులు వేగవంతం చేశామని తెలిపారు.

"అమరావతిని హైదరాబాద్ ప్లస్ సిటీగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరాల్లో ఒకటిగా నిర్మించి తీరుతా" అని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ మరమ్మతులు పూర్తిచేసి, వచ్చే ఏడాదికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

సంపద సృష్టితో పాటు.. సమాజ సేవ ముఖ్యం

పారిశ్రామికవేత్తలు సంపద సృష్టితో పాటు సామాజిక బాధ్యతను కూడా విస్మరించవద్దని చంద్రబాబు పిలుపునిచ్చారు. తాను గతంలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ3) మోడల్‌ను ప్రోత్సహించానని, ఇప్పుడు సమాజంలోని అసమానతలను తగ్గించడానికి పీ4 (People`Public`Private Partnership for Philanthropy) మోడల్‌ను ముందుకు తెస్తున్నానని చెప్పారు.

"వీదీఖ 10-20" అనే కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తున్నానని, అంటే "మార్గదర్శి-బంగారం" అని అర్థమని వివరించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10% మంది, అట్టడుగున ఉన్న 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. డబ్బు ఇవ్వడమే కాకుండా, వారికి మార్గనిర్దేశం చేసి చేయూతనివ్వడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని హితవు పలికారు.

## 25 ఏళ్లుగా అధికారంలో.. ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు

పనిచేసిన వ్యక్తిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ప్రజా జీవితంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఆయన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. పవన్ కుమార్ చామ్లింగ్ సిక్కిం సీఎంగా 8,930 రోజులు పదవిలో కొనసాగగా, నరేంద్ర మోదీ ఆ రికార్డును దాటి 8,931 రోజులు పూర్తి చేసుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా ఆయన పనిచేసిన కాలాన్ని కలిపి ఈ ఘనత సాధించారు. ఈ అరుదైన మైలురాయి ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సీఎంగా, పీఎంగా అత్యధిక కాలం

నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 మే 21 వరకు, దాదాపు 13 ఏళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగి, గుజరాత్‌కు అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా నిలిచారు. అనంతరం 2014 మే 26న 14వ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా, వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నేతగా ఆయనకు పలు రికార్డులు ఉన్నాయి. పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తిచేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా ఆయన ఘనత సాధించారు.

సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లు

రాజకీయ రికార్డులతో పాటు, డిజిటల్ ప్రపంచంలోనూ మోదీ తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ ఏడాది ఆయన సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లను దాటారు. ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుని, ప్రపంచ నేతల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత ఫిబ్రవరిలో ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌స్టాలో 10.1 కోట్ల మంది, ఎక్స్ (ట్విట్టర్) లో 10.64 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

## ట్రంప్ హెచ్చరికకు ఇరాన్ కౌంటర్




హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు చేసిన ప్రకటన గల్ఫ్ ప్రాంతంలో కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. పశ్చిమాసియాలోని సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ వంటి దేశాలు తమ తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం సముద్రపు నీటిని శుద్ధి చేసే డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ హెచ్చరికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్లాంట్లపై చిన్న క్షిపణి దాడి జరిగినా కోట్లాది మంది ప్రజలు తీవ్ర నీటి సంక్షోభంలో చిక్కుకుంటారు. విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే నీటి శుద్ధి కేంద్రాల పునరుద్ధరణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది, ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందుకే తమపై దాడి జరిగితే శత్రుదేశాల మనుగడనే దెబ్బతీసేలా ఈ ప్రణాళికను ఇరాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనతో అమెరికాకే కాకుండా, ఆ దేశ మిత్రపక్షాలైన అరబ్ దేశాలకు కూడా ఇరాన్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చింది. దీంతో హార్మూజ్ జలసంధి వివాదం ఇప్పుడు 'నీటి యుద్ధం' వైపు మళుతోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న వేళ, ఇరు దేశాల నుంచి వస్తున్న ఇటువంటి కవ్వింపు చర్యలు, ప్రతిస్పందనలు గల్ఫ్‌లో యుద్ధ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

# చీచమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడుదొడుకుల ప్రభావం వినియోగదారులు, పరిశ్రమలపై పడకుండా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. తగినన్ని నిల్వలను కొనసాగించేందుకు, సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కీలకమైన హోర్ముజ్ జలసంధి వంటి సముద్ర మార్గాలకు అంతరాయం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై ప్రధాని మోదీ ఒకరోజు ముందే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజేష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతి, స్థిరత్వం అవసరాన్ని నొక్కిచెప్పడంతో పాటు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను సురక్షితంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో భాగంగా, భారతదేశం ఇప్పటికే తన చమురు దిగుమతులను అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి పెంచుకుంది. ప్రస్తుతం మన చమురు దిగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ యేతర దేశాల నుంచే వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎల్‌పీజీ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అమెరికా నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామని, వినియోగదారుల స్థాయిలో సరఫరాకు ఎలాంటి అంతరాయం లేదని వారు స్పష్టం చేశారు.

# విజయవంతంగా జాబ్ మేళా భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత

**- 325మంది ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందజేత**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 22

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్శి రాముల కళ్యాణ







మండపంలో జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాను టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. జాబ్ మేళాకు కామారెడ్డి, బిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, బీబీపేట్, పాల్వంచ, రామారెడ్డి మండలాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి భారీగా యువత ఇంటర్వ్యూకు హాజరయ్యారు. నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, జాబ్ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. 50 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరు కాగా, 3500 మంది నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు. ఇందులో టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటి, ఫార్మ, మెడికల్, బ్యాంకింగ్, వెల్ఫేర్, రియల్ ఎస్టేట్ తదితర రంగాల నుంచి కంపెనీలకు సంబంధించిన వాటికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఎంపికైనా 325 నిరుద్యోగ యువతకు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిండ్ల అంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, సబ్బని కృష్ణహరి, నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జూలూరి సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమిది,మహేష్, తాటి ప్రసాద్, రాంశెట్టి హర్షిత, మాజీ కౌన్సిలర్లు శంకర్ రావ్, చాట్ల వంశీ, కాంగ్రెస్ నాయకులు జమిల్, రవీందర్ గౌడ్, రంగా రమేష్ గౌడ్,నర్సొళ్ల మహేష్,బల్ల శ్రీనివాస్, నిరంజన్,మెహర్ బాబా, గంగారాములు, తదితరులు పాల్గొన్నారు.






# శృంగేరి శారదా పీఠాదీశ్వర జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

- శృంగేరి శారదా పీఠం లో ఉత్తరాధికారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి
- నారికేళ హవనం మహా యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలోనూ పాల్గొన్న బండి సంజయ్







**కర్ణాటక రాష్ట్రము వెలుతురు మార్చి 22:** కర్ణాటక లోని శ్రీశ్రీశ్రీ శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతి అనంత శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి 76వ జయంతి ఉత్సవాల్లో కేంద్ర హోం సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి స్వామీజీ నిర్వహించిన పలు ప్రత్యేక పూజల్లో సంజయ్ కుమార్ పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పీఠాధిపతి జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణం లో విధుశేఖర భారతి స్వామీజీ నిర్వహించిన సహస్ర నారికేళ హవనం మహా యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో కూడా కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సహస్ర నారికేళ హవనం యజ్ఞం ప్రాసస్త్యం గురించి శృంగేరి పీఠం పూజారులు మంత్రికి వివరించారు. శ్రీ విధుశేఖర భారతి స్వామీజీ తన స్వహస్తాలతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కు సహస్ర నారికేళ హవనం మహాయజ్ఞం తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం బండి సంజయ్ శృంగేరి శారదాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠ తెలంగాణ బాధ్యులు శ్రీ వ్యాసోజల రాధాకృష్ణ శర్మ కూడా పాల్గొన్నారు.

# తెలంగాణలో బిల్డింగ్ రూల్స్‌లో కీలక మార్పులు.. - టీడీఆర్‌పై కొత్త గైడ్‌లైన్స్ జారీ

**హైదరాబాద్, వెలుతురు మార్చి 22:**
తెలంగాణలో భవన నిర్మాణ నిబంధనలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు 21 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ఇకపై హైరైజ్‌గా పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. నిర్మాణ రంగంలో పారదర్శకత, క్రమబద్ధీకరణ లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 40 అడుగుల రోడ్డు వద్ద 3 అంతస్తులు, 60 అడుగుల రోడ్డు వద్ద 4, 80 అడుగుల రోడ్డు వద్ద 5 అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. అయితే, 10 అంతస్తులు దాటిన భవనాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులు దాటిన భవనాలకు 5 శాతం టీడీఆర్ లోడింగ్ కల్పించారు. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో నిర్మించే 18 నుంచి 21 మీటర్ల ఎత్తున్న భవనాలకు టీడీఆర్ వాడకాన్ని తప్పనిసరి చేశారు. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ ద్వారా సెట్‌బ్యాక్‌లో సడలింపులు ఇవ్వగా, హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతించారు. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసే సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి ముందు చెల్లించాల్సి ఉంటుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్పులు నిర్మాణ రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఇక్రిశాట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు... తెలంగాణ పరువు తీయొద్దన్న హరీశ్ రావు

**హైదరాబాద్, వెలుతురు మార్చి 22:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాలుగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఇక్రిశాట్ (ICRISAT)ను అమెరికాకు చెందిన సంస్థగా సీఎం అభివర్ణించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కనీస వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడి తెలంగాణ పరువు తీయవద్దని హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 1972 నుంచి పటాన్‌చెరు కేంద్రంగా పనిచేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గురించి కూడా సీఎంకు స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు. ఇక్రిశాట్ అనేది ఏ ఒక్క దేశానికీ చెందినది కాదని, అది ఒక స్వతంత్ర, లాభాపేక్ష లేని అంతర్జాతీయ పరిశోధనా సంస్థ అని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ సంస్థ ఏర్పాటులో ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (FAO), ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP)తో పాటు ప్రపంచ బ్యాంకు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రారంభ దశలో ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ల సహకారంతో పాటు, భారత ప్రభుత్వం సహా అనేక దేశాల మద్దతుతో నడుస్తున్న ఒక గ్లోబల్ వేదికను 'అమెరికా రీసెర్చ్ సెంటర్' అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. కేవలం ఇక్రిశాట్ విషయంలోనే కాకుండా, నల్లమల సరిహద్దులు, కృష్ణా–గోదావరి జలాలు, సుంకేసుల ప్రాజెక్టుల వంటి కీలక అంశాలపై కూడా సీఎంకు సరైన అవగాహన లేదని హరీశ్ రావు ఆరోపించారు. ఇంతటి ప్రాథమిక విషయాలు కూడా తెలియని స్థితిలో రాష్ట్రాన్ని నడపడం వల్ల తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చేసే ప్రతి వ్యాఖ్య బాధ్యతాయుతంగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకుని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఘాటుగా హితవు పలికారు.

# నవీన కురుక్షేత్రం : ఇరాన్ - ఇజ్రాయెల్ - అమెరికా మధ్య ముదురుతున్న యుద్ధ మేఘాలు



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*వేల సంవత్సరాల క్రితం కురుక్షేత్ర యుద్ధ క్షేత్రంలో శంఖారావం మోగింది. అది కేవలం రాజ్య కాంక్ష కోసం జరిగిన యుద్ధం కాదు, అది ఒక సిద్ధాంతపరమైన ఘర్షణ, ధర్మాధర్మాల మధ్య నలిగిన మానవ సంబంధాల సమ్మేళనం. నేడు, 2026 మార్చి నాటికి, పశ్చిమ ఆసియా (మధ్యప్రాచ్యం) గడ్డపై అచ్చం అటువంటి దృశ్యమే ఆవిష్కృతమవుతోంది. ఇరాన్, అమెరికా, మరియు ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మరో మహాభారత యుద్ధం అంచున నిలబెట్టాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పురాణ కాలపు కురుక్షేత్రానికి, నేటి భౌగోళిక రాజకీయ కురుక్షేత్రానికి మధ్య ఉన్న సారూప్యతలు సామాన్యమైనవి కావు. అవి మానవ స్వభావంలోని శాశ్వతమైన అహంకారాన్ని, వ్యూహాత్మక చదరంగంలోని ఎత్తుగడలను ప్రతిబింబిస్తున్నాయి. కురుక్షేత్ర యుద్ధం ప్రాథమికంగా ఒకే వంశానికి చెందిన అన్నదమ్ముల మధ్య జరిగిన పోరాటం.*

పశ్చిమ ఆసియా చరిత్రను పరిశీలిస్తే, ఇక్కడ కూడా ఒకప్పుడు గాఢమైన స్నేహం ఉండేది. 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు ఇరాన్ మరియు ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వాములు. కానీ కాలక్రమేణా, అధికారం మరియు సిద్ధాంతపరమైన విభేదాలు వారిని బద్ధశత్రువులుగా మార్చాయి. ఇది కురుక్షేత్రంలో భీష్ముడు, ద్రోణుడు వంటి మహారథులు మనసులో పాండవుల పట్ల ప్రేమ ఉన్నప్పటికీ, విధిలేక కౌరవుల పక్షాన నిలబడాల్సి వచ్చిన పరిస్థితిని గుర్తుచేస్తుంది. నేడు అంతర్జాతీయ సమాజంలో కూడా అనేక దేశాలు తమకు ఇష్టం లేకున్నా, కేవలం దౌత్యపరమైన ఒప్పందాల వల్ల లేదా ఆర్థిక ప్రయోజనాల కోసం ఏదో ఒక పక్షం వహించాల్సి వస్తోంది. ప్రపంచం ఇప్పుడు స్పష్టంగా రెండు శిబిరాలుగా విడిపోయింది. మహాభారతంలో కృష్ణుడు తన సైన్యాన్ని (నారాయణీ సేన) ఒకరికి ఇచ్చి, తను మాత్రం ఆయుధం పట్టకుండా మరొకరికి సలహాదారుగా నిలిచాడు. నేటి ఆధునిక యుద్ధ తంత్రంలో ఇరాన్ సరిగ్గా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇరాన్ నేరుగా యుద్ధ రంగంలోకి రాకుండా, తన యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ ద్వారా పరోక్ష యుద్ధం (ProIy War) చేస్తోంది. లెబనాన్‌లోని హిజ్బుల్లా, యెమెన్‌లోని హౌతీలు, సిరియాలోని సాయుధ బలగాలు వీరంతా ఇరాన్ అందించిన ఆయుధాలతో, శిక్షణతో పోరాడుతున్న ఆధునిక అక్షౌహిణి సైన్యాలే.

మరోవైపు, ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్న అమెరికా, అర్జునుడికి రక్షణగా నిలిచిన కృష్ణుడి పాత్రను పోషించాలని అనుకుంటోంది. కానీ ఇక్కడ కృష్ణుడు శాంతిని కోరుకుంటే, ఆధునిక శక్తులు మాత్రం ఆయుధ సరఫరా ద్వారా యుద్ధాన్ని ఇంధనం చేస్తున్నాయి. రష్యా మరియు చైనా వంటి దేశాలు ఈ నాటకంలో తమ స్వంత లాభాల కోసం వేచి చూస్తున్న శకుని లేదా నారదుడి పాత్రలను పోషిస్తున్నాయి. వారు నేరుగా రంగంలోకి దిగకపోయినా, తెర వెనుక నుండి పాచికలు వేస్తూ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుపు తిప్పుతున్నారు. కురుక్షేత్రంలో ప్రతి ఒక్కరూ తమ వైపు ధర్మం ఉందని నమ్మారు. అర్జునుడు విషాదంలో ఉన్నప్పుడు కృష్ణుడు స్వధర్మం గురించి బోధించాడు. నేడు కూడా ప్రతి దేశం తన చర్యలను ధర్మబద్ధంగానే సమర్థించుకుంటోంది. ఇజ్రాయెల్ దృష్టిలో తన పౌరుల ప్రాణాలను కాపాడుకోవడం, ఉగ్రవాదాన్ని తుదముట్టించడం పరమ ధర్మం. ఇరాన్ దృష్టిలో పాశ్చాత్య సామ్రాజ్యవాదాన్ని అడ్డుకోవడం మరియు పాలస్తీనియన్ల హక్కుల కోసం పోరాడటం ధర్మం. అమెరికా దృష్టిలో ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడటం తన బాధ్యత. కానీ యుద్ధంలో సంపూర్ణ ధర్మం అనేది ఒక భ్రమ. యుద్ధం ప్రారంభమయ్యాక నియమాలు కనుమరుగవుతాయి. కురుక్షేత్రంలో అభిమన్యుడిని చంపడానికి ఏడుగురు మహారథులు నిబంధనలు ఉల్లంఘించినట్లే, నేటి యుద్ధాల్లో కూడా అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులు తుంగలో తొక్కబడుతున్నాయి. డ్రోన్ దాడులు, సైబర్ దాడులు మరియు పౌర నివాసాలపై బాంబుల వర్షం కురుస్తుంటే, అక్కడ ధర్మం ఎక్కడ ఉందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మహాభారతంలో బ్రహ్మాస్త్రం లేదా పాశుపతాస్త్రం ప్రయోగించినప్పుడు కలిగే




వినాశనం గురించి భయంకరమైన వర్ణనలు ఉన్నాయి. అవి సృష్టిని అంతం చేయగల శక్తి కలిగినవి. నేటి ప్రపంచంలో అణు ఆయుధాలే ఆ ఆధునిక బ్రహ్మాస్త్రాలు. ఇరాన్ అణు సామర్థ్యం దిశగా అడుగులు వేస్తుంటే, ఇజ్రాయెల్ ఇప్పటికే ఆ శక్తిని కలిగి ఉందని బహిరంగ రహస్యం. అమెరికా తన అణు అమ్ములపొదతో ప్రపంచాన్నే శాసించగలదు. ఈ డిటరెన్స్ (నిరోధకత) సిద్ధాంతం ప్రకారం, ఎదుటివారి దగ్గర వినాశకర ఆయుధం ఉందనే భయమే యుద్ధాన్ని ఆపుతుందని అంటారు. కానీ ఒక్క పొరపాటు జరిగినా, ఒక్క నాయకుడు ఆవేశంలో నిర్ణయం తీసుకున్నా, అది ప్రపంచ వినాశనానికి దారితీస్తుంది. అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ఎలాగైతే ఉత్తర గర్భంలోని శిశువును లక్ష్యం చేసుకున్నాడో, నేటి యుద్ధాలు కూడా భవిష్యత్తు తరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. దుర్యోధనుడి అహంకారం కురుక్షేత్రానికి మూల కారణం. సూది మొన మోపినంత భూమిని కూడా ఇవ్వను అన్న అతని మొండితనం కురు వంశ నాశనానికి దారితీసింది. నేటి నాయకులలో కూడా అటువంటి అహంకారమే కనిపిస్తోంది. సంప్రదింపులకు తావు లేకుండా, కేవలం తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలనే తపన ప్రపంచాన్ని విపత్తులోకి నెట్టేస్తోంది. ప్రతి దేశం తన గౌరవం (Prestige) కోసం లక్షల మంది సామాన్య పౌరుల ప్రాణాలను పణంగా పెడుతోంది. చరిత్ర నేర్పిన పాఠం ఏమిటంటే, అహంకారంతో కూడిన అధికారం ఎప్పుడూ పతనం వైపుకే దారితీస్తుంది. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక ధర్మరాజుకు లభించింది ఏమిటి? శ్మశాన సదృశ్యమైన రాజ్యం. తన సొంత మనుషులందరినీ కోల్పోయాక దక్కిన విజయం అతనికి చేదు అనుభవాన్ని మిగిల్చింది. నేటి మధ్యప్రాచ్య యుద్ధం కూడా అటువంటి ఆర్థిక మరియు మానవ నష్టాన్నే మిగులుస్తుంది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఆంక్షల వల్ల అతలాకుతలమవుతోంది, ఇజ్రాయెల్ తన రక్షణ కోసం బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది, అమెరికా తన అప్పుల భారాన్ని పెంచుకుంటోంది. ఈ యుద్ధంలో ఎవరు గెలిచినా, అంతిమంగా మానవత్వం ఓడిపోతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలితే, ఆ శిథిలాలపై సింహాసనం వేసుకుని కూర్చోవడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు.

ఈ రెండు పరిస్థితులను విశ్లేషించినప్పుడు ఒక భయంకరమైన ప్యాటర్న్‌ను గుర్తిస్తుంది. చారిత్రక డేటా ప్రకారం, ఎప్పుడైతే కూటముల మధ్య విభజన తీవ్రమవుతుందో, ఎప్పుడైతే దౌత్యం విఫలమై ఆయుధాల ప్రదర్శన మొదలవుతుందో, అప్పుడు యుద్ధం దాదాపు అనివార్యం అవుతుంది. మెషిన్ లెర్నింగ్ మోడల్స్ సూచిస్తున్న ప్రకారం, 2026 నాటి ఈ ఉద్రిక్తతలు ఒక క్లిష్ట దశకు చేరుకున్నాయి. మానవ స్వభావంలోని అహేతుకత (×తీతీఞఆశీఋశ్రీఊఎ) ను మనం లెక్కించలేకపోవచ్చు, కానీ చరిత్ర పునరావృతమవుతున్న తీరును మాత్రం స్పష్టంగా చూపిస్తోంది. భీష్ముడు తన చివరి శ్వాస విడిచే ముందు యుధిష్ఠిరుడికి ఒక మాట చెప్పాడు శాంతి అనేది బలహీనత కాదు, అది అత్యున్నతమైన శక్తి. నేటి ప్రపంచ నాయకులు ఈ విషయాన్ని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య ఉన్న సమస్యలు సంక్లిష్టమైనవే కావచ్చు, కానీ అవి యుద్ధం ద్వారా పరిష్కారం కావు. కురుక్షేత్రం మనకు ఒక హెచ్చరిక. అది కేవలం గతం కాదు, మనం జాగ్రత్త పడకపోతే మన భవిష్యత్తు కూడా అదే అవుతుంది. ఆధునిక సాంకేతికత, అపారమైన మేధస్సు ఉన్న ఈ కాలంలో కూడా మనం ఆదిమ కాలపు హింసను ఆశ్రయిస్తే, చరిత్ర మనల్ని క్షమించదు. కొత్త కురుక్షేత్రం ఆకృతి దాల్చుతోంది నిజమే, కానీ దాన్ని నివారించే శక్తి ఇంకా మానవత్వం చేతుల్లోనే ఉంది. మనం ఎంచుకునేది రక్తపాతమా లేక రాజీ మార్గమా? కాలం అడుగుతున్న ప్రశ్న ఇది.

# భట్టన్న బడ్జెట్‌తో మహిళలకు అగ్రతాంబూలం

- రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ మహిళా కాంగ్రెస్
- సంక్షేమం నుంచి సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వ స్పష్టమైన అడుగు

**హైదరాబాద్, వెలుతురు మార్చి 22:**
తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 202627 మహిళా సాధికారతకు కొత్త నిర్వచనం ఇచ్చింది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, డిప్యూటీ సీఎం మరియు ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్రబిందువుగా నిలబెట్టే ప్రయత్నాన్ని స్పష్టంగా చూపించింది. ఈ బడ్జెట్‌ను విశ్లేషిస్తే, మహిళల ఆర్థిక స్వావలంబన, భద్రత, విద్య, మరియు రోజువారీ జీవన ప్రమాణాల మెరుగుదలపై సమగ్ర దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది.

**మహిళా శక్తి మిషన్‌కు భారీ కేటాయింపులు**

బడ్జెట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన "మహిళా శక్తి మిషన్" కోసం రూ.2,500 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను బలోపేతం చేయాలనే సంకల్పాన్ని వెల్లడించింది. వడ్డీ లేని రుణాల ద్వారా ఒక కోటి మహిళలకు ఆర్థిక బలం చేకూర్చే లక్ష్యంతో ఈ పథకం రూపొందించబడింది. ఇక మహిళలను సంప్రదాయ ఉపాధి అవకాశాలకు మాత్రమే పరిమితం చేయకుండా, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి కొత్త రంగాల్లోకి ప్రవేశపెట్టే దిశగా ప్రణాళికలు రూపొందించడం గమనార్హం. దీనికి తోడు 22 శిక్షణ మరియు మార్కెటింగ్ కేంద్రాల ఏర్పాటు గ్రామీణ మహిళలకు వ్యాపార అవకాశాలను విస్తరించనుంది.

**మహాలక్ష్మి పథకం, జీవన వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం**

మహిళల రోజువారీ జీవన భారం తగ్గించడంపై ప్రభుత్వం



ప్రత్యేక దృష్టి పెట్టింది. "మహాలక్ష్మి" పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం మరియు రూ.500 గ్యాస్ సిలిండర్ అందించేందుకు రూ.4,305 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ చర్యలు మహిళల చలనం (mobility) పెంచడమే కాకుండా, కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించే కీలక నిర్ణయాలుగా భావించవచ్చు.

**సామాజిక భద్రతకు బలమైన మద్దతు**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం రూ.3,683 కోట్లు కేటాయించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మహిళల జీవితంలోని ముఖ్యమైన దశల్లో ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలు సామాజిక సమానత్వానికి తోడ్పడతాయి.

**'పాలన' పథకం ..ఉద్యోగ మహిళలకు సహాయం**

ఉద్యోగం చేసే మహిళలకు పిల్లల సంరక్షణ ఒక ప్రధాన సవాలుగా ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు "పాలన" పథకం కింద 500 డే కేర్ సెంటర్ల ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం ప్రగతిశీల చర్యగా భావించవచ్చు. ఇది మహిళల ఉద్యోగ అవకాశాలను పెంచడమే కాకుండా, కుటుంబ మరియు వృత్తి జీవితాల మధ్య సమతుల్యత సాధించేందుకు సహాయపడుతుంది.

**విద్య, భద్రతపై దృష్టి**

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ.400 కోట్లు, హైదరాబాద్ సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు రూ.100 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం మహిళల భవిష్యత్తు మరియు భద్రతపై దృష్టి పెట్టింది. మహిళలు విద్యాసంస్థల్లో, ఉద్యోగ ప్రదేశాల్లో, ప్రజా స్థలాల్లో భద్రంగా ఉండే వాతావరణం సృష్టించడం ఈ కేటాయింపుల లక్ష్యంగా కనిపిస్తోంది.

**సంక్షేమం నుంచి సాధికారతకు మార్పు**

ఈ బడ్జెట్ మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా గుర్తించడం ద్వారా కొత్త దిశను సూచిస్తోంది. సహాయం మరియు సాధికారత మధ్య సమతుల్యత సాధించడంలో ఈ బడ్జెట్ ఒక ముందడుగుగా నిలుస్తుంది.

**ముగింపు**

తెలంగాణ బడ్జెట్ 202627 మహిళల సాధికారతను కేంద్రంగా చేసుకుని రూపొందించబడిన సమగ్ర పథక పత్రంగా నిలిచింది. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా బలోపేతం చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త వేగాన్ని అందించే ప్రయత్నంగా దీనిని చూడవచ్చు.

# ఇరాన్ యుద్ధానికి ఉత్తమ ఔషధం అదే: డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్

**న్యూఢిల్లీ మార్చి 22 (వెలుతురు) :**
మధ్యప్రాచ్యంలో యుద్ధం అత్యంత ప్రమాదకరమైన దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌లోని నతాన్జ్ అణు కేంద్రం, ఇజ్రాయెల్‌లోని దిమోనా అణు సదుపాయం ఉన్న నగరంపై దాడులు జరిగినట్లు వచ్చిన నివేదికలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) దర్యాప్తు చేస్తోందని టెడ్రోస్ తెలిపారు. ప్రస్తుతానికి రేడియేషన్ స్థాయుల్లో ఎలాంటి అసాధారణ పెరుగుదల నమోదు కాలేదని నివేదికలు చెబుతున్నా, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పు సృష్టిస్తుందని హెచ్చరించారు. అన్ని పక్షాలు అత్యంత సైనిక సంయమనం పాటించాలని, శాంతే ఉత్తమ ఔషధమని పిలుపునిచ్చారు. యుద్ధం శాంతిని తీసుకురాదని, రాబోయే తరాలకు ద్వేషించడానికి కొత్త కారణాలను మాత్రమే నేర్పుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అణు ప్రమాదాలు సంభవిస్తే స్పందించేందుకు ఇప్పటికే 13 దేశాల్లో తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవకపోతే, ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. అందులోనూ మొదట అతిపెద్ద ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని తన సోషల్ మీడియా పోస్టులలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఇరాన్ నౌకాదళం, వాయుసేనతో పాటు యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని, తమ సైనిక లక్ష్యాలకు దగ్గరగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని, కానీ శత్రుదేశాలకు మాత్రం ప్రవేశం లేదని ఇరాన్ కౌంటర్ ఇచ్చింది.

# సకాలంలో ఓ పాజిటివ్ రక్తాన్ని అందజేసిన ఏఐవైఎఫ్ జిల్లా సెక్రెటరీ ముదాం ప్రవీణ్

**- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 22**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో సయ్యద్ అబ్దుల్ (30) రక్తహీనతతో బాధపడుతుండడంతో వారికి కావలసిన రక్తం రక్తనిధి కేంద్రాలలో లభించకపోవడంతో ఆలిండియా యూత్ ఫెడరేషన్,సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ ముదాం ప్రవీణ్ మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ అబ్దుల్ కి శరీరంలో రక్తం మూడు శాతానికి పడిపోవడంతో వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని అన్నారు,రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని మానవతా దృక్పథంతో రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాత ముదాం ప్రవీణ్ కు అభినందనలు తెలియజేశారు.

# కర్దనూర్ గ్రామంలో ఘనంగా శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు

**- పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్**



**ముత్తంగి వెలుతురు మార్చి 22:**

ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్దనూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు కాట సుధా గారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతల్ ఘాట్ వద్ద ఉచిత మట్టి నీటి కుండల సేవా కార్యక్రమం ప్రారంభం

**- ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న టిపు సుల్తాన్ సోషల్ సర్వీస్ టీమ్...**

**- మాజీ టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ చేతుల మీదుగా ప్రారంభం...**




**జహీరాబాద్ వెలుతురు మార్చి 22:**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం చింతల్ ఘాట్ వద్ద ఉచిత మట్టి మినరల్ వాటర్ కుండల సేవా కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా ప్రారంభించారు. అనేక సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాన్ని టిపు సుల్తాన్ సోషల్ సర్వీస్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ తన్వీర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా ప్రయాణికులు, కూలీలు, స్థానిక ప్రజలకు ఈ మట్టి నీటి కుండలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమాజ సేవలో టిపు సుల్తాన్ సోషల్ సర్వీస్ టీమ్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మున్సిపల్ వైస్ చైర్మన్ హన్నాన్ జావేద్, హఫీజ్, ముజ్జఫర్ హుస్సేన్, హమీద్, సంపత్, సర్ఫరాజ్ ఫిర్దౌస్ (యూత్ ఐకాన్ కోహిర్), యూసుఫ్ పటేల్, జలీల్ తదితరులు పాల్గొన్నారు. టిపు సుల్తాన్ సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చింతల్ ఘాట్ వద్ద ప్రతి సంవత్సరం ఈ ఉచిత మట్టి నీటి కుండల కార్యక్రమం నిర్వహించడం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. వేసవి కాలంలో ప్రయాణికులు మరియు గ్రామస్తులకు తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

# ఐలాపూర్ గ్రామంలో వైభవంగా నిర్వహించిన మల్లన్న స్వామి మరియు రేణుక ఎల్లమ్మ తల్లి జాతర

**- దర్శించుకున్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్**



**అమీన్‌పూర్ వెలుతురు మార్చి 22:**

అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి మరియు రేణుక ఎల్లమ్మ తల్లి జాతర వైభవంగా నిర్వహించారు. ఈ జాతరలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

# జల సంరక్షణ కోసం నడుంబిగించాలి...

**- నీటి ఎద్దడి శాశ్వత నివారణ చర్యలు ప్రజల చేతుల్లోనే...**

**- నీరును ఒడిసి పట్టండి, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేయండి**

**- నగర మేయర్ కొలగని శ్రీనివాస్**





**కరీంనగర్ వెలుతురు మార్చి 22:**

వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఉన్నాయని, జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, నీటి ఎద్దడి శాశ్వత నివారణ జల సంరక్షణతోనే సాధ్యమని, నీటిని సంరక్షించే బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందని నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక వైశ్య భవన్ లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా సుజలాం సుఫలాం అనే గోడ ప్రతులని ఆవిష్కరించి మాట్లాడారు . ఎండాకాలం త్రాగునీరు లేక ఎంతోమందిప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాన నీరు వృధాగా పోతున్న దానిని ఒడిసిపట్టుకోవాలనే ఆలోచన చేయకపోవడంతోనే, నేడు ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. నగరం లో ప్రతి ఒక్కరు తమ ఇంటిలో కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని అన్నారు. వ్యవసాయ భూముల్లో కూడా ఇంకుడు గుంతలు ఉంటే సాగునీరుకు ఇబ్బందులు ఉండమన్నారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణ రావు మాట్లాడుతూ పొలాలలో ఎండిపోయిన బోరు భావి చుట్టు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవచ్చునని, గుట్టల చుట్టు, బీడు భూముల చుట్టు కాంటూరు కంధకాలు త్రావ్వకోవాలని, ప్రతి గ్రామం లో వాగుకు అడ్డంగా వాటర్ షెడ్ ప్రాజెక్ట్ నిర్మాణం చేసుకోవటం వలన భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత తీరు తుందని అన్నారు. సర్వో దయ అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడు తూ కలుషిత నీరు త్రాగడం వలన లక్షలాది మంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ,చాలా మంది చిన్న పిల్లలు చనిపోతున్నారని ,జలవనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో66 వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, మానేరు పర్యావరణ సమితి బాధ్యులు గంజి స్వరాజ్యబాబు, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మండలంలో రూ.50 లక్షల నిధులతో గ్రామాల అభివృద్ధి పనుల ప్రారంభం

**- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్ రావు...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 22:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆధ్వర్యంలో జహీరాబాద్ మండలానికి చెందిన పలు గ్రామాల్లో రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులను ఘనంగా ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణతో కలిసి గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైన్ మరియు ఇతర మౌలిక వసతుల పనులకు శ్రీకారం చుట్టారు. గోవింద్‌పూర్ గ్రామంలో రూ.30 లక్షల విలువైన పనులు ప్రారంభించగా, అందులో రూ.25 లక్షలు అండర్ డ్రైన్ జీపీ నిధులతో చేపట్టే పనులు, అదనంగా రూ.5 లక్షల సీసీ రోడ్ల పనులు ఉన్నాయి. అలాగే రాయిపల్లి డి గ్రామంలో రూ.5 లక్షలు, హుగ్గెల్లి తండాలో రూ.5 లక్షలు, అల్గోల్ గ్రామంలో రూ.5 లక్షలు, బుచినెల్లి గ్రామంలో రూ.5 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొత్తం రూ.50 లక్షల నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి సదుపాయాలను మరింతగా మెరుగుపరచేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకురావడానికి తాము నిరంతరం ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఆత్మ చైర్మన్ పెంటా రెడ్డి, హోతి బి సర్పంచ్ మచ్చేందర్, గోవింద్‌పూర్ గ్రామ సర్పంచ్ కవిత వెంకట్, పార్టీ అధ్యక్షులు వీర్శెట్టి, మాజి సర్పంచ్ రాజు, నాయకులు ఖలీల్, నర్సింలు, చంద్రయ్య, రాములు, రాయిపల్లి డి గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజి జెడ్పీటీసీ యేసు రత్నం, పార్టీ ప్రెసిడెంట్ శేఖర్ పటేల్, మాజి సర్పంచ్ విజయ్, ఉప సర్పంచ్ స్వామిదాస్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, మోహన్, వసంతు, సంజీవ్ రావు, సామెల్, హుగ్గెల్లి తండా సర్పంచ్ గేని బాయి, పార్టీ ప్రెసిడెంట్ రాథోడ్ భీమ్ రావు నాయక్, బిక్కు రాథోడ్, సంజయ్, బిక్కి బాయి, లాలూ, మధు జాదవ్, పరశురామ్, దేవిదాస్, సునీల్, విజయ్, ఈశ్వర్, రామరావు, అల్గోల్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ చంద్రకాంత్ రెడ్డి, ప్రభాకర్, శ్రీకాంత్, అనిల్, నర్సింలు, శామ్, మూబీన్, వీరన్న, అలోక్, మారుతి, రాజు సాబ్, శేఖర్ రెడ్డి, బుచినెల్లి గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్, పార్టీ ప్రెసిడెంట్ గోవింద్ రెడ్డి, నాయకులు అబ్బాస్, ఉప సర్పంచ్ ఇనయాత్, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ బీమా పథకం ప్రజలందరికీ వరం

**- అనంత చంద్రశేఖర్ గౌడ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



**చండూరు వెలుతురు మార్చి 22:**

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాన నసభ బడ్జెట్ సమావేశంలో శాసనసభ సాక్షిగా డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవే శపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఇంటింటికి ఇందిరమ్మ ఐదు లక్షల రూపాయల భీమా సౌకర్యాన్ని కల్పించడం పట్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం అవుతుందని చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన చండూరులో మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన బడ్జెట్ తన జీవిత కాలంలో ఎప్పుడూ చూడలేదని, పేద ప్రజల పక్షాన నిలవడం ఒక్క కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా అవసరాలను గుర్తించి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజల మన్ననలు అందుకుంటుందని, అదేవిధంగా ఇంటింటికి ఇంది మ్మ ఐదు లక్షల బీమా సౌకర్యం ప్రతి ఒక్క కుటుంబానికి వర్తింపజే యడం తెలంగాణ రాష్ట్రం మినహా మరే రాష్ట్రంలో సాధ్యమయ్యే పని కాదని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. జూన్ 2 నుండి ఇంటింటికి ఇందిరమ్మ ఐదు లక్షల బీమా సౌకర్యం ప్రారంభం అవుతుండడంతో కుటుంబంలో ఏ ఒక్కరు సహజ మరణం పొందిన ఆ కుటుంబానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయల ఇందిరమ్మ బీమా పథకం అసరాగా నిలిచి భీమా మొత్తాన్ని అందజేస్తుందని చెప్పారు. అదేవిధంగా ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందించడానికి బడ్జెట్లో నిధుల కేటా యింపు జరిగిందని, మూడు రోజులపాటు పాలు, మరో మూడు రోజుల పాటు రాగిజావను విద్యార్థులకు అందించి రక్తహీనత నుండి విద్యార్థులను ఆదుకుంటుందన్నారు. ఇప్పు టివరకు ప్రభుత్వ పాఠశా లలో చదువుకునే విద్యార్థు ఇకపై లకు మధ్యాహ్న భోజనం అందజేస్తుండగా ఇంటర్మీడియట్ విద్యార్థు లకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింప చేయడానికి బడ్జెట్లో నిధుల కేటాయింపు జరిగిందని, రాష్ట్రంలోని మరో రెండు లక్షల మందికి కొత్తగా ఆసరా పెన్షన్లు అందించడానికి బడ్జెట్లో కేటాయింపులు జరపడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి అనంత చంద్రశేఖర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


కార్యక్రమంలో అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి బడ్జెట్లో 50 వేల 717 కోట్లు కేటాయింపులు జరిపి ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం పెంచుకున్న నమ్మకాన్ని స్పష్టం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే పేద ప్రజలకు మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ద్వాక్రా మహిళా సంఘాలకు 2000 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందజేసి వారి జీవితాలలో వెలుగు నింపడానికి ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పడిన ప్రభుత్వం ప్రజా పాలన నడుస్తుంది అని తెలిపారు

మన మునుగోడు అభివృద్ధి ప్రదాత పేదల పెన్నిధి శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు నియోజక వర్గంలో ఏ ఆపద వచ్చిన నేను ఉన్నానంటూ ఆపన్న హస్తం అందిస్తూ ఆరోగ్య పరంగా కంటి వైద్య శిబిరాలు ఆరోగ్య సమస్యలు వస్తే ఆదుకుంటూ పేదలకు దేవుడైతున్నాడు ,అదేవిధంగా మునుగోడు నియోజకవర్గంలో 2 మున్సిపాలిటిలు ఉంటే జనరల్ స్థానాల్లో బిసి లకు ఛైర్మెన్ పదవులు ఇచ్చి బిసి పక్షపాతిగా నిలిచిపోతున్నాడు ఏది ఏమైనప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లో మునుగోడు ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది అని తెలియజేశారు.

# రాచకొండ వీరభద్ర ఆలయంలో పూజలు

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మార్చి 22:**

చారిత్రాత్మకమైన రాచకొండలో 13వ శతాబ్దంలో నిర్మితమైన శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అభిషేకం చేశారు. వీరశైవుల ఆరాధ్య దైవమైన వీరభద్రుడికి తెలంగాణ రాష్ట్రంలోని కురవి, కొత్తకొండ, బొంతపల్లి, మంచిరేవుల ప్రాంతాలతో పాటు రాచకొండలో ఆలయం నిర్మాణం అవడం విశేషమని, 700 ఏళ్ల క్రితం నాటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ ఉత్సవంలో పాల్గొన్న వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ప్రతినిధులు నిర్ణయించారు. ఈ సంఘం గౌరవ అధ్యక్షుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బిక్షపతి ఆధ్వర్యంలో కుటుంబాలతో సహా ఈ పూజలో పాల్గొని ఆలయ పరిసరాల్లో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.







రాచకొండను సందర్శించి వీరభద్రాలయం అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించినందుకు వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్షపతిని, సంఘం ప్రతినిధులను రాచప్ప సమితి గౌరవ అధ్యక్షుడు కడారి అంజిరెడ్డి, కే. రవీందర్ రెడ్డి, "బ్రీత్" ఆశ్రమం మేనేజర్ ఎండి సలాం ఆజాద్ సన్మానించారు.

## జాతి జనగణలో బీసీ కుల గణన చేపట్టాలనీ బీసీ జేపీసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో ఢిల్లీ బయలుదేరిన బీసీలు

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో జెండా ఊపి ప్రారంభించిన బీసీ జేపీసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్
- కుక్కలను,పులులను లెక్కిస్తారు గానీ బీసీలను లెక్కించరా .. బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 22:**
ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా మొదలుకానున్న జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టాలనే ప్రధాన డిమాండ్ తో డిల్లి లోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే దురంతో ఎక్స్ప్రెస్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ జండా ఊపి ప్రారంభించారు.కొన్ని దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగణను చేపట్టాలని బీసీలు ఉద్యమాలు చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ఏప్రిల్ 30,2025న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జాతీ జన గణనలో సమగ్ర కులగణన చేపడతామని ప్రకటించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జనగణనలో 33 ప్రశ్నలను రూపొందించి అందులో ఎస్సీ ఎస్టీ కుటుంబాలు ఎన్ని అడిగిన కేంద్ర ప్రభుత్వం బీసీ కుటుంబాల సంఖ్యను విస్మరించడం చాలా బాధాకరమన్నారు.కుక్కలను, పిల్లులను,పులులను లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బీసీల లెక్కలు తీయకపోవడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్జ కృష్ణా కుల్కచర్ల శ్రీనివాసు విక్రం గౌడ్ కనకాల శ్యామ్ మహేష్ యాదవ్ ఈడిగ శ్రీనివాస్ బొల్లేపల్లి స్వామి రావుల కోల్ నరేష్ గూడూరు భాస్కర్ డ్యాగల్ శ్రీనివాస్ వీరస్వామి గజ్జెల సత్యరాజు కేయూ నాగరాజు గౌడ్ కొత్త నరసింహ స్వామి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## మార్చి 26న జరగనున్న హైకోర్టు, జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో బీసీలను ఎన్నుకుందాం

- న్యాయవస్థలో కూడా బీసీలకు అన్యాయమే జరుగుతుంది.
- బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 22:**
న్యాయవ్యవస్థలో కూడా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు ఈ నెల మార్చి 26న జరగనున్న హైకోర్టు జిల్లా కోర్టు మున్సిఫ్ కోర్టు ల బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీసీలంత ఏకమై ఐక్యమత్యమై ఒకతాటిపైకి వచ్చి బీసీలనే గెలిపించుకొని బహుజనుల సత్తా చాటాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కోర్టులలో మరియు మున్సిఫ్ కోర్టుల్లో నియమించే ప్రభుత్వ న్యాయవాదులను కేవలం ఒకే ఒక సామాజిక వర్గాన్నికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

## గోషామహల్ లో ఉస్మానియా ఆసుపత్రి కట్టడం వలన 100 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డుపై బైఠాయించిన బాలయ్య బడా వాసులు



**బషీర్ బాగ్ వెలుతురు 22 మార్చి :**
గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని వ్యతిరేకిస్తూ. బేగంబజార్ లో ఆందోళనకు దిగిన బాలయ్య బాడ బస్తీ వాసులు. ఆసుపత్రి రహదారి కోసం 50 ఇండ్లు ఖాళీ చేయాలని. జీ హెచ్ఎంసీ అధికారులు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు. దింతో వంద కుటుంబాలు రోడ్డు పడతాయని ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు. వంద ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న తమ ఇండ్లను కూల్చవద్దని.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేడుకున్నా స్థానికులు. ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ.తమకు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించిన స్థానికులు. ట్రాఫిక్ కు అంతరాయం కలగడంతో అరెస్ట్ చేసిన గోషామాల్ పోలీసులు.

## తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో "పాత సీసాలో కొత్త సారా" లాగా ఉందని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఏద్దేవా



**బషీర్ బాగ్ వెలుతురు 22 మార్చి :**
.తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ "పాత సీసాలో కొత్త సారా" లాగా ఉందని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ విమర్శించారు..నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ముదిరాజ్ ప్రగతి భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ముదిరాజ్ యువతను సన్మానించారు. యూపీఎస్సీ, గ్రూప్-1, సామాజిక, పత్రికా, పోలీస్ రంగాల్లో రాణించిన వారిని అభినందించారు..ఈ సందర్భంగా బండ ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నిధుల కొరత ఉందని, ఆర్థిక వనరుల సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగించడంతో పాటు కొత్త హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అవి పూర్తిగా నెరవేరలేదని పేర్కొన్నారు.

# సీసీసీ దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధుల సమావేశం




**హైదరాబాద్ వెలుతురు మార్చి 22:**
హైదరాబాద్ కాచిగూడ లోని సుప్రభాత్ కాంటినెంటల్ ఓ హోటల్ లో సీ సీ సీ సౌత్ దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ప్రాంతీయ మరియు జాతీయ రాష్ట్రాల ప్రతినిధుల సమావేశం జాతీయ ఉపాధ్యక్షులు డా మేడా రామకృష్ణ గారి అధ్యక్షతన జరగగా నేషనల్ చీఫ్ పాట్రన్ విక్యాత్ వాసుదేవ్ షెనాయ్ ముఖ్య అతిథి గా నేషనల్ సెక్రటరీ జెనరల్ మొగిలిచెర్ల సుదర్శన్ , తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు రజని రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ ఉన్నతస్థాయి ప్రతినిధుల సమావేశం లో దక్షిణ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ నుండి డా కాసా చిరంజీవి తమిళనాడు నుండి మణికందన్, కేరళ నుండి నరసింహన్, కర్ణాటక నుండి హనుమ తెలంగాణ నుండి దిద్ది లక్ష్మీనారాయణ, ఫజలుదీన్ తదితరులు పాల్గొని వినియోగ చట్టాలు వాటి అమలు తీరుపై పలు తీర్మానాలు చేశారు. చట్టసభల్లో రూపుదిద్దుకున్న వివిధ చట్టాల అమలులో ప్రభుత్వ యంత్రాంగానికి అడుగడుగునా అడ్డుపడుతూ చట్టాల ఫలితాలు వినియోగదారులకు చేరకుండా ప్రజా ప్రతినిధులు అడ్డుపడదాన్ని గర్హిస్తూ తీర్మానించింది. దేశ వ్యాప్తంగా ఆహార, ఔషదాల , నిత్యావసరాల కల్తీ పెద్దఎత్తున జరుగుతూ వినియోగదారుల ఆరోగ్య, ఆర్థిక నష్టాలు జరుగుతున్నా . నిత్యం తూనికలు ,కొలతల్లో మోసాలు, ఆన్లైన్ మోసాలు, రియల్ ఎస్టేట్ మోసాలు, వివిధ ఆర్థిక సంస్థల మోసాలు జరుగుతున్నా నియంత్రించాల్సిన , నేరస్తులను శిక్షించాల్సిన ఎన్ఫోర్స్మెంట్ శాఖలు, ధృవీకరణ శాఖలు ప్రజా ప్రతినిధుల నీడలో నిస్తేజంగా పనిచేయడం వల్ల వినియోగదారులకు జరుగుతున్న తీవ్ర నష్టాన్ని రాజ్యాంగ పరంగా లభించిన జ్యుడీషియరిలో అన్ని రాష్ట్రాల్లో సవాలు చేయాలని తీర్మానించింది. వినియోగ దారుల రక్షణ చట్టం ద్వారా సంక్రమించిన ఆహార సలహా సంఘాల సమావేశాలు, ధరల నియంత్రణ కమిటీ సమావేశాలు, వినియోగదారుల పరిరక్షణ సమితి సమావేశాలు జిల్లా,రాష్ట్ర మరియు కేంద్ర స్థాయిలో సంబంధిత మంత్రులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ వ్యాపార మరియు వినియోగదారుల ప్రతినిధుల తో జరిపి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే వేదికలను అన్ని ప్రభుత్వాలు గత పన్నెండు సంవత్సరాలుగా పక్కన పెట్టడమే ఈ సమస్యలకు ప్రధాన కారణమని, కావున వెంటనే వాటి పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. తదనంతరం ఈ అంశాలపై అన్ని రాష్ట్రాల వినియోగదారుల ప్రతినిధులను సమాయత్తం చేయడానికి విస్తృత స్థాయి సమావేశాలు గోవా,తమిళనాడు , మధ్యప్రదేశ్ మరియు డిల్లీ రాష్ట్రాల్లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

# హెల్త్ కార్డు ల పేరిట గ్రామీణులకు టోకరా

**కరీంనగర్ వెలుతురు మార్చి 22:**
తమ వద్ద రిజిస్టర్ చేసుకుంటే ప్రైవేటు ఆసుపత్రుల్లో భారీ డిస్కౌంట్లు లభిస్తాయి అంటూ కరీంనగర్ జిల్లాలోని అనేక గ్రామాల్లో ఒక్కో వ్యక్తి నమోదుకు 50 రూపాయలు అమాయక గ్రామీణుల వద్ద అక్రమంగా వసూలు చేస్తున్న ముఠా ఉదంతం కరీంనగర్ జిల్లాలో వెలుగు చూసింది. గ్రామంలోని పెత్తందారులను మచ్చిక చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేని సదరు వ్యక్తులు ఏకంగా గ్రామపంచాయతీ భవనంలోనే పొద్దంతా మకాం వేసి ఒక్కో రోజుకు ఐదు వందల నుంచినుంచి 800 మందిని నమోదు చేస్తూ 25 వేల నుంచి 40 వేల వరకు వసూలు చేస్తున్నారని ఇందులో గ్రామ సర్పంచ్లకు, కార్యదర్శులకు మామూళ్లు ఇస్తూ తమ కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి గ్రామపంచాయతీ ఆవరణలోనే ఈ ముఠా ఆధార్ కార్డులతో నమోదు చేస్తూ గ్రామీణుల ఆధార్ వివరాలు ఎలా సేకరిస్తారని గ్రామపంచాయతీ ఆవరణలో అక్రమ కార్యకలాపాలకు కార్యదర్శులు సర్పంచులు ఎందుకు సహకరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఐదు పదివేల లంచాలకు సర్పంచ్లు కార్యదర్శులు లొంగిపోవడంతో ఒక్కో రోజుకు ఆయా గ్రామాల్లో 30 నుండి 40 వేలు గ్రామీణులు కోల్పోతున్నారని అంతేకాకుండా ఆధార్ నంబర్ మరియు ఆధార్ వివరాలు కూడా ఈ ముఠా సేకరించి అక్రమ కార్యకలాపాలకు వినియోగించే అవకాశం ఉందని తెలుస్తోంది. కంచే చేను మేసిన చందంగా గ్రామాలను కాపాడవలసిన సర్పంచులు మామూళ్లకు ఆశపడి ఇలాంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం చూసి పోలీసు అధికారులు కూడా విస్తుపోతున్నారు.

ఈ ముఠా కార్యకలాపాలపై కన్నేసి ఉంచవలసిందిగా, ఎవరైనా ఫిర్యాదు చేస్తే ముఠా సభ్యులతో పాటు సర్పంచ్లను కార్యదర్శులను బాధ్యులను చేయవలసిందిగా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించడం తో ఇంటెలిజెన్స్ వర్గాలు సదరు వ్యవహారం పై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

# సైబరాబాద్ లో వీకెండ్‌స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..173 మందిపై కేసులు




**సైబరాబాద్ వెలుతురు మార్చి 22:**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి I రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 173 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.138 ద్విచక్ర వాహనదారులు,10 ఆటోలు,22 కార్లు, 03 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 145 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 15 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 13 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చునున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (16.03.202621.03.2026) లో మొత్తం 358 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో00 మందికి జరిమానా, జైలు శిక్ష, 02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,356 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సేవలు మరువలేనివి రాములు నిజం అయినా కమ్యూనిస్టువాది నియోజకవర్గం అభివృద్ధివాది
- బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 22:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో వైష్ణవిగార్డెన్ లో జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే క్రీశే కొండిగారి రాములు గారి దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పులమలవే సి నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లాఅధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి భువనగిరి పార్లమెం ట్ ఇంచార్జ్ క్యామమల్లేష్ ఈసందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సే వలు రెండుసార్లు గెలిచి నియోజకవర్గంని అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని ఇబ్రహీంపట్నం నియో జకవర్గ ప్రజలు అతనుచేసిన సేవలు మరువలేనివి



చేసిన సేవలు ప్రజలగుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోతాయని అన్నారు ఒక కమ్యూనిస్టు వాదిగాఎల్లప్పుడూనియోజకవర్గం అభివృద్ధి కోరు కున్నారని అన్నారు రానున్న రోజులలో మాజీఎమ్మెల్యే కొండిగారి రాములు కుటుంబానికి అండ గా ఉంటాం అని అన్నారు ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు తనయుడు కౌన్సిలర్ త్రిలోక్ ఇబ్రహీంపట్నంమాజీ.మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ సుల్తాన్ ఇబ్రహీంపట్నంమాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ జానీపాషా బిఆర్ఎస్ పార్టీ నాయకు లు ఆకులసురేష్ కసరమోని మల్లేష్ జలంధర్ మడుపుశివసాయి కంబాలపల్లి భరత్ కుమార్ బహదూర్ నాయక్ ఆరుట్లగ్రామసర్పంచ్ మానిపాటి శోభకుమార్ ఆరుట్ల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖఅధ్యక్షుడు వార్డుసభ్యుడు పున్నంరాము చిందంజంగయ్య సాతిరిసత్యం బర్మలవెంకటేష్ తదితరులుపాల్గొన్నారు

## శ్రీ శ్రీ రవి శంకర్ గురు గారి ఆధ్వర్యంలో సోమనాథ్ జ్యోతిర్లింగ పూజ మరియు దర్శనం కార్యక్రమం



**హైదరాబాద్ వెలుతురు మార్చి 22:**
ఆదివారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని కెఎంఐటి లో ఉన్న సర్దార్ పటేల్ ఆడిటోరియంలో శ్రీ శ్రీ రవి శంకర్ గురు గారి ఆధ్వర్యంలో సోమనాథ్ జ్యోతిర్లింగ పూజ మరియు దర్శనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ మరియు సభ్యులు డిపి అగర్వాల్, మంజు అగర్వాల్, సురేందర్, నరేందర్ మరియు హిమాయత్ నగర్ డివిజన్ నుంచి వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువుగారు జి రామన్ గౌడ్ ని పూలమాలవేసి ఆశీర్వచనం చేయడం జరిగింది.

## మస్జిద్ - ఈ - మహమ్మదీయ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 22:**
ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి టు బిహెచ్ కే సముదాయం వద్ద గల మస్జిద్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మతసామరస్యం వెల్లివిరియాలని, అందరూ కలిసికట్టుగా ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, శంభీపూర్ క్రిష్ణ, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పాక్స్ మాజీ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు శ్రీనివాస్ గౌడ్, మస్జిద్ కమిటీ సభ్యులు, 2 బిహెచ్కె సముదాయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్లలో శ్రీ వెంకటేశ్వర, శివ, వీరాంజనేయ ఆలయ 22వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహణ



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 22:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర, శివ, వీరాంజనేయ ఆలయ 22వ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్,అవిజే జేమ్స్, బేకు శ్రీనివాస్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పండరి రావు, ప్రవీణ్ ముదిరాజ్ శ్రీనివాస్, సుజాత యాదవ్, జ్యోతి, తదితరులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

# మన ఊరు మన స్కూలు మనకు ముద్దు



**గుండాల మార్చి 22 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ కాలి మంజుల ఆంజనేయులు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దయ్యాల వాని ఆధ్వర్యంలో గ్రామంలో గడపగడప తిరుగుచు మన ఊరు మనబడి మనకు ముద్దు ప్రైవేట్ బడి వద్దు అనే నినాదంతో గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల కుటుంబాల ఇంటింటికి తిరిగి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు విధానాలను గురించి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని రాబోయే కాలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉద్యోగాలు ప్రభుత్వం అందించే పథకాలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొడి శెట్టి వెంకన్న సార్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# కూరెళ్ళ విఠలాచారి సాహిత్యం- సమాలోచనం అను పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 22:**



గ్రామం వెల్లంకి శ్రీపరాభవ ఉగాది సందర్భంగా వెల్లంకిలోని ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయంలో కవి సమ్మేళనంతో పాటు "కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యం- సమాలోచనం"అను పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య సంపాదకత్వంలో వెలువడిన "కూరెళ్ళ సాహిత్యం- సమాలోచనం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య కూరెళ్ల సాహిత్యం పై డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు సంబంధించిన వ్యాసాలను ఒక పుస్తకంగా తీసుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. డాక్టర్ కూరెళ్ళ సమగ్ర సాహిత్యానికి ఈ పుస్తకం నిలువుటద్దం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య పల్లెల్లో ఉంటూ తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి వ్యక్తియని, ఎంతోమందికి ఆదర్శప్రాయులని అన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న 40 మంది కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, పుస్తక సంపాదకులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, మహిళాభారతి అధ్యక్షులు డాక్టర్ దాసోజు పద్మావతి, కార్యక్రమ సమన్వయకర్త, యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కూరెళ్ల గ్రంథాలయం అధ్యక్ష కార్యదర్శులు భోగోజు గోవర్ధనాచారి, కూరెళ్ళ నర్మద తోపాటు పలువురు సాహితీవేత్తలు కవులు పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన తిమ్మాపురం మహేందర్‌రెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 22:**



యాదాద్రి- భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన తిమ్మాపురం మహేందర్ రెడ్డి ని మరియు ఎగ్జిక్యూటివ్ నెంబర్ గుండాల నరసింహ నీ భువనగిరి వివేర హోటల్ లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రామన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి , మాజీ జెడ్పిటిసి పున్న జగన్మోహన్,మాజీ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస బాలకిషన్, జినుకల ప్రభాకర్, మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి,శంబాల వెంకన్న, కే.భాస్కర్ రెడ్డి, తాళ్లపల్లి సత్తిరెడ్డి, పోలు వెంకట్ రెడ్డి, ఎడ్ల సురేందర్ రెడ్డి, కర్రె రమేష్, పి.నరసింహ, బి.నరసింహ, గట్టు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మార్క్

- మందుల సత్యం.



**మునుగోడు, మార్చి 22 (వెలుతురు ):**

గ్రామాలలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మందుల సత్యం తెలిపారు.ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు లేనట్టే, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభివృద్ధి చేయని గ్రామం లేదు" అని వ్యాఖ్యానించారు.ప్రతి గ్రామంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని అన్నారు.చండూర్,చౌటుప్పల్ మున్సిపాలిటీల ఏర్పాటు,చండూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేయడం, డిండి, శివన్నగూడెం ప్రాజెక్టుల ప్రారంభం వంటి కీలక పనులు ప్రభాకర్ రెడ్డి కృషి ఫలితాలేనన్నారు. సోలిపురం వంతెన,100 పడకల ఆసుపత్రి వంటి పనులు ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు.కొందరు చేస్తున్న విమర్శలు పూర్తిగా అనవసరమని, అభివృద్ధిని ఓర్చుకోలేక శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడిగా ప్రభాకర్ రెడ్డి నిలిచారని, రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. అధికార పార్టీ నాయకులకు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పగిల్ల సతీష్, మండల సంయుక్త కార్యదర్శి మాధనబోయిన పరమేష్ యాదవ్, పోలగొని సైదులు, నల్గొండ అంజి,జంగిలి సాంబయ్య,భూపతి రెడ్డి, ఈద శరత్ బాబు, ఐతగోని శేఖర్,దోటి కరుణాకర్,బండారు శ్రీనివాస్,యడవల్లి సురేష్,గోలి ప్రవీణ్, వరంగటి శంకర్,గాలి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# 2000 -2001 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 22:**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2000 2001 విజ్ఞాన వర్ధిని హై స్కూల్ రామన్నపేట గురువులు ఉయ్యాల రాములు గోపాల్ రెడ్డి, ఏనుగు లక్ష్మారెడ్డి విద్యార్థులు మేడబోయిన ఉపేందర్, ఆవుల నరేందర్, గాదే సతీష్, గాదే రాము, నోముల చంద్రశేఖర్, నల్ల వెంకట్రెడ్డి, ఆకవరపు ఉదయ్ కుమార్, అప్పం సంతోష్, కోనూరు లింగస్వామి,గొరిగి గుమ్ముల నర్సిరెడ్డి, మహేష్, కవిత, ప్రీతీ, కవిత, హేమలత, మమత, సత్య శ్రీ ,రాపోలు శ్యాంసుందర్, కొండా వెంకటేశం,శివకుమార్, రెవణాల సత్యనారాయణ, శ్రీకారం మథిన్, ఎస్కే మహబూబ్ జానీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించిన ప్రధాన అర్చకుడి పై చర్యలు తీసుకోవాలి

- బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ డిమాండ్
- జాతా శౌచం ( పురుడు మైల ) ఉన్నప్పటికీ బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రధాన అర్చకుడు పాల్గొనడం శాస్త్ర విరుద్ధం అని ఆరోపణ
- ఈ వ్యవహారంపై ఐఏఎస్ అధికారి లేదా రిటైర్డ్ జడ్జి చే పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్
- బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఈవోకు వినతిపత్రం అందజేసిన నేతలు



**యాదగిరిగుట్ట , మార్చి 22 ( వెలుతురు )**

జాతా శౌచం ఉన్నప్పటికీ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించి హిందూ ధర్మానికి విఘాతం కలిగించేలా వ్యవహరించిన యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన అర్చకుడు కాండూరి వెంకటాచార్యులు, ముఖ్య అర్చకులు కాండూరి శ్రీనివాసచార్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ డిమాండ్ చేశారు ఆదివారం ఆయన పలు హిందూ సంఘాల నేతలతో కలిసి యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో జె భవాని శంకర్ కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవస్థానంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న కాండూరు వెంకటాచార్యులు శాస్త్రానికి ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపించారు . కాండూరీ వెంకటాచార్యులు సొంత పాలి బంధువైన కాండూరి భార్గవ్ కు శిశువు జన్మించగా హిందూ శాస్త్ర ప్రకారం శిశువు జన్మించిన రోజు నుండి ఆ కుటుంబానికి చెందిన వారికి జాత శౌచం పది రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఆయన ఆలయానికి వెళ్లడం పూజలు చేయడం ఇతర ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడం చేయకూడదని తెలిపారు. సొంత పాలి బంధువు అయినప్పటికీ కాండూరి వెంకటాచార్యులతో పాటు ముఖ్య అర్చకులు శ్రీనివాసచార్యులు కూడా ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించారని అన్నారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో వారు పాల్గొని సాంప్రదాయానికి విఘాతం కలిగించారని ఆరోపించారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడేందుకు ప్రయత్నించారని అన్నారు. ఫిబ్రవరి 25వ తేదీన జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కాండూరు వెంకటాచార్యులు జాత శౌచం ఉన్నప్పటికీ నిర్వహించారని అన్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవుడికి సమర్పించే పట్టు వస్త్రాలను ఆయన మైలలోనే స్వయంగా పట్టుకున్నారని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రులకు అధికారులకు మైలలో ఆశీర్వచనం చేశారని ఆరోపించారు. ఆ తర్వాత జరిగిన రథోత్సవం సందర్భంగా కూడా ఆయన రథంపై ఎక్కి పూజలు నిర్వహించారని పూర్ణాహుతి చక్రస్నానం కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు అని తెలిపారు. ఇవన్నీ మీడియాలో లైవ్ గా టీవీలలో పత్రికలలో వచ్చాయని చెప్పారు. ఈ విధంగా శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించిన కాండూర్ వెంకటాచార్యులు ముఖ్య అర్చకులు కాండూరి శ్రీనివాసచార్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇది హిందూ ధర్మాన్ని శాస్త్రాన్ని అవమానపరచడమేనని ఆయన ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై తగిన విధంగా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వీరిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఐఏఎస్ ఐపీఎస్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తితో కమిటీ వేసి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు తాము యాదగుట్ట దేవస్థానం ఈవోకు ఒక వినతి పత్రాన్ని అందజేశామని దీనిపై పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారని నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దళిత సంఘర్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్ద యుగంధర్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమాండ్ల విష్ణు, టేకి రాజశేఖర్ , విహెచ్పి నేత కొమ్మ గళ్ళ వెంకటేశ్వర్లు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల పరిరక్షణ సమితి కన్వీనర్ కనుకుంట్ల విజయకుమార్, బిజెపి నేత బొల్లం చంద్రమౌళి , మన్నెం నరసింహారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# బడ్జెట్ లో బీసీలకు తీవ్ర అన్యాయం

- బిఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య



**యాదగిరిగుట్ట , మార్చి 22 ( వెలుతురు )**

మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి 50 వేల కోట్లు కేటాయించాలని , కామారెడ్డి డిక్లరేషన్ పేరిట అధికారంలోకి వచ్చి బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య మండిపడ్డారు. ప్రతి ఏటా బీసీల బడ్జెట్ కు 25వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ఒక రూపాయి కేటాయించకపోవడం అన్యాయం అన్నారు. ఆదివారం పట్టణంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు కామారెడ్డి డిక్లరేషన్ చూపి ఇలా బీసీలను పూర్తిగా మర్చిపోయారన్నారు. బీసీల ఓట్లను ఒక బ్యాంకు గా చూడడమే తప్ప వారి అభివృద్ధికి ప్రభుత్వం ఏమాత్రం పాటుపడటం లేదన్నారు. ఈ బడ్జెట్ లో సామాజిక న్యాయం జరుగలేదని అన్నారు. గౌడ్స్ , గొల్ల కురుమలు, పద్మశాలి, రజక, కుమ్మరి, కమ్మరి కులస్తులతో పాటు బీసీ ల్లో ఏ కులస్తులకు న్యాయం జరుగలేదని ఆవేదన చెందారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో బీసీ సంక్షేమానికి యేటా 25వేల కోట్ల బడ్జెట్ను కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన హామీలను మర్చిపోయి బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిక్లరేషన్ ఊసెత్తడం లేదన్నారు . ప్రతి ఏటా బిసి సంక్షేమానికి 25000 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల కాలంలో కేవలం ఐదు కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీల నుంచి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, మండల సెక్రెటరీ జనరల్ కసావు శ్రీనివాస్ గౌడ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయకులు మాటూరి బాలయ్య గౌడ్, కంసాని స్వామి, శారాజీ రాజేష్ యాదవ్, విజయ్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా నగర్ లో నూతనంగా జరిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 22:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధి సాయిబాబా నగర్ లో నూతనంగా జరిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మరియు శ్రీ వీరాంజనేయ స్వామి టెంపుల్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఏలేటి వెంకట్ రెడ్డి కి,ప్రధాన కార్యదర్శి గా గజానంద్ కి మరియు ఉపాధ్యక్షులుగా రాజి రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసి నూతన కమిటీ కాలని అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలనీ కాలనీ నూతన కమిటీ సభ్యులను కోరిన బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి.ఈ కార్యక్రమం లో నాగదీప్ గౌడ్, దేవరాజ్, భరత్, విజయందర్ రెడ్డి, నాగేష్, సోమశేఖర్, నారాయణ, సూర్యకాంత్, ఇంద్రారెడ్డి, చందర్, సత్యనారాయణ, ఈశ్వర్, పరశురామ్, అరుణ్, ప్రభాకర్, మహేష్, బాలరాజు, కరణ్, గౌరీష్, శివ, శుభమ్, అక్షయ్, సూర్య, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరం కొలన్ హన్మంత్ రెడ్డి.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 22:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, 128 డివిజన్ చింతల్ పరిధికి చెందిన చంద్రనగర్ వాసులు పి. నాగేష్, బి. అశోక్ గౌడ్, అలాగే మల్లంపేట్‌కు చెందిన శ్రీమతి సి. అంజు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీరు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు.వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సీఎం సహాయనిధికో ద్వారా సి. అంజుకు రూ. 2,75,000, ల్వో ద్వారా పి. నాగేష్‌కు రూ. 60,000, బి. అశోక్ గౌడ్‌కు రూ. 22,500 ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.ఈ మంజూరు పత్రాలను ఆదివారం బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజే జేమ్స్, బండి శ్యామ్ గౌడ్, సిద్దనోల సంజీవ రెడ్డి, పందరి రావు, మైసిగారి శ్రీనివాస్, కప్ప సుబ్బా రెడ్డి, గణేష్, కొలన్ జీవన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బల్ రెడ్డి, అక్కినబోయిన సాధు యాదవ్, భాస్కర్ రెడ్డి, అదిరెడ్డి, శ్రీనివాస్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండాల మండలంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



**గుండాల మార్చి 22 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో బిజెపి శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం బిజెపి పార్టీ పనిచేస్తుందని ప్రతి కార్యకర్త సంక్షేమ పథకం ప్రతి బీదవాడికి అందే విధంగా కృషి చేయాలని అన్నారు. జమ్ము కాశ్మీర్ లో జరిగిన సంఘటనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి బాధ్యత వహించాలి అని అన్నారు భారతీయ జనతా పార్టీ ప్రతినిత్యం ప్రజల కోసమే పనిచేస్తుందని అన్నారు అటల్ బీహార్ వాజ్పేయి లాల్ బహుదూర్ శాస్త్రి లాల్ కృష్ణ అద్వానీ దేశం కోసం త్యాగం చేసిన వ్యక్తులు అని అన్నారు. హిందువుల మీద దాడి జరిగితే స్పందించేది ఒక బీజేపీ పార్టీ అని అన్నారు. దేశం కోసం ధర్మం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి అన్నారు. 370 ఆర్టికల్ రద్దు చేసింది బిజెపి అని ముస్లిం మహిళ ల గౌరవం పెంచడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేసిందని అన్నారు అటల్ బీహార్ వాజీపాయి ప్రభుత్వం ఏర్పాటు చేసి పరిపాలన అంటే ఏమిటో బిజెపి ప్రభుత్వం ప్రజలకు చూపించారు కాంగ్రెస్ కమ్యూనిస్టులు పొత్తు పెట్టుకుని పార్టీ ఆశయాలను బొందపెట్టిన బిజెపి మాత్రం ప్రజల కోసం పనిచేస్తుంది అని అన్నారు.రామ మందిరం నిర్మించి రామరాజ్యం అంటే ఏమిటో చూపించింది బిజెపి అని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఒక్కొక్క పనులు చేసుకుంటూ ముందుకు పోతున్నది ప్రపంచ దేశాలు భారత దేశంవైపు చూసే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుంది రంజాన్ పండుగ సందర్భంగా భారతదేశంలో ఉన్నా ముస్లిమ్స్ 40 రోజులు ఒక్కపొద్దు నుండి ప్రశాంతంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు అంటే అది ఒక్క బిజెపి ప్రభుత్వం వల్లనే అని అన్నారు. లవ్ జిహాద్ పేరుతో జరుగుతున్న అరాచ కాలను తిప్పుకొట్టాలని అన్నారు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వానియేనని ఆయుష్మాన్ భారత్ కేంద్ర ప్రభుత్వం ప్రతి బీదవారికి ఇల్లు కట్టుకోవడం అవకాశం కల్పించింది అని అన్నారు. గ్రామ గ్రామాన బిజెపి పార్టీ నీ బలోపేతం చేసి దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి, గుజ్జా సోమనర్సయ్య, జిల్లా కౌన్సిల్ మెంబెర్ చెడ నాగయ్య, మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పింగళి విజయభాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్స్ చంద్రశేఖర్, సురేష్ ,కోశాధికారి పరమేశ్వరి, వివిధ గ్రామాల అధ్యక్షులు వార్డ్ సభ్యులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పేదలను కార్మికులను గాలికొదిలేసినరాష్ట్ర బడ్జెట్

- సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 22:**

రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు నిధుల కోతకు నిరసనగా షాపూర్ నగర్ లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ఈ కార్యక్రమంలో పాల్గొన్నా కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ....రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు ప్రభుత్వం కోత పెట్టింది. ప్రభుత్వం ప్రతిపాదిత బడ్జెట్‌ను సవరించి ఆయా తరగతులకు న్యాయం చేయాలని.రూ.3, 24,233 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ప్రవేశపెట్టారని 2025-26లో బడ్జెట్‌లో రూ.3,04,000 కోట్లకు పైగా ప్రతిపాదన పెట్టి దాదాపు రూ.26వేల కోట్లు ఖర్చు పెట్టలేదని,ఈ బడ్జెట్. కూడా అదే విధంగా ఉందని ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు.రైతు భరోసా కు రూ. 25 వేల కోట్లు అవసరముంటే,రూ.18 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారని మహాలక్ష్మి పథకానికి మహిళలకు రూ.2,500 ఊసే లేదని తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకుపైగా ఇండ్లు లేనివారుంటే,ఈ బడ్జెట్‌లో కేవలం రూ.5,500 కోట్లు మాత్రమే ప్రతిపాదన చేశారని తెలిపారు.గృహ నిర్మాణానికి గతం కంటే కూడా ప్రస్తుత బడ్జెట్‌లో 1,344 కోట్లు కోత పెట్టారూ.విద్యుత్ రంగానికి రూ.326 కోట్లు తగ్గించారనీ, మైనారిటీల,వెనుకబడిన తరగతుల, గిరిజనుల సంక్షేమానికి కేటాయింపులు లేవని,ఎస్సీ,ఎస్టీలకు గత ప్రభుత్వం దళిత బంధు కింద రూ.10లక్షల చొప్పున ఇస్తామనగా,కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందనికానీ..బడ్జెట్‌లో కనీసం ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉపాధి,నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదనీ,విద్యా.వైద్యం ప్రయివేటీకరణను అరికట్టాలంటే నిధులు కేటాయింపులు చేసి ప్రభుత్వ రంగంలో దీన్ని బలపరచాలని కానీ నిధులు నామ మాత్రంగా పెంచినట్టుగా చూయించారూ వాస్తవానికి విద్యా,వైద్యాన్ని ప్రయివేటీకరణ నుంచి అరికట్టడానికి అవి ఏమాత్రం సరిపోవని, నిధులు పెంచాలని అన్నారు విద్యా,వైద్యం,ఉపాధి అవకాశాలు మెరుగుపడడానికి,దళిత,గిరిజన, బలహీన వర్గాల,మైనారిటీల సంక్షేమానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పసుల అంజయ్య శ్రీశైలం స్వాతి యాదవ రెడ్డి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.